క్లుప్తంగా

దుర్గాదేవి ఆలయంలో ఏకాహం



ఆలయంలో ఏకాహంలో భాగంగా భజనలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి: మండలంలోకాగిత గ్రామంలో దుర్గాదేవి ఆలయ 15వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయంలో ఏకాహం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కాగిత, న్యాయంపూడి, ఉపమాక, చినదొడ్డిగల్లు, తదితర గ్రామాల నుంచి ప్రత్యేక భజన బృందాలు వచ్చి భక్తి గీతాలు ఆలపించారు. మంగళవారం అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అక్షరాస్యత పెంపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: గ్రామాల్లో పని చేస్తున్న వీవోఏలు అక్షరాస్యతను పెంచడానికి కృషి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. సోమవారం ఐకేపీ కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 20 మందిని ఎంపిక చేసుకుని వారికి ప్రాథమిక విద్య, ఆర్థిక విద్య, డిజిటల్ విద్య నేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం స్వచ్ఛందంగా నిర్వహించాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి రెమ్యూనరేషన్ ఉండదన్నారు. అలాగే డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఎం శ్రీనివాస్, వీవోఏలు పాల్గొన్నారు.

పూడిమడకలో తహసీల్దార్ పర్యటన

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడకలో సోమవారం తహసీల్దార్ జీవీ జనార్దన్ పర్యటించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజలంతా జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లే క్రమంలో అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

పాటిపల్లి కేజీబీవీ సందర్శన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: పాటిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఎంఈవో బుద్ధ శివనాయుడు సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, హాస్టల్‌ను పరిశీలించారు. మనబడి- మన భవిష్యత్ కార్యక్రమం పనులను పరిశీలించిన ఆయన.. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. భోజన సదుపాయంపై ఆరా తీశారు. ప్రత్యేకాధికారి రాణి, సీఆర్ఎంటీ కర్రి లక్ష్మీనారాయణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సన్యాసిదేముడి విగ్రహావిష్కరణ



హరిపాలెంలో సన్యాసిదేముడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామంలో సోమవారం పెంటకోట సన్యాసిదేముడు విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఆవిష్కరించారు. సన్యాసిదేముడు పీఏసీఎస్ డైరెక్టర్‌గా, 2007 నుంచి 2009 వరకు ఇందిరమ్మ ఇళ్ల కాలనీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పీవీఎల్ ఈశ్వరరావు, నాగలక్ష్మి, పీవీవీజీ నాయుడు, షర్మిల, పి.ఆదిబాబు, సంతోష్ లక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

శివారు గ్రామాలపై శీతకన్ను



పురుషోత్తపురంలో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనం

- ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి ఆమడ దూరం
- ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మునగపాక: ఏళ్లు గడుస్తున్నా శివారు గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడి గ్రామీణ ప్రాంతాల్లో అమలుకు నోచుకోవడం లేదు. ఫలితంగా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా శివారు గ్రామాలపై శీతకన్ను ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

సమస్యల వెల్లువ

మునగపాక మండల వ్యాప్తంగా 26 పంచాయతీలు ఉన్నాయి. మరో 12 వరకు శివారు గ్రామాలున్నాయి. ప్రధాన గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారిస్తున్నారే గానీ, ఈ శివారు గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పల్లపు ఆనందపురం శివారు పురుషోత్తపురంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పప్పల చలపతిరావు ఎంపీగా ఉన్న సమయంలో రూ.5 లక్షలతో సామాజిక భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో శ్లాబ్ పూర్తయింది. తరువాత నుంచి నేటి వరకు అసంపూర్తిగానే భవనం దర్శనమిస్తోంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రిగా పనిచేసిన కాలంలో కొణతాల రామకృష్ణ సామాజిక భవనం నిర్మించేందుకు రూ.3 లక్షలు మంజూరు చేశారు. అయితే నిధులూ చాలకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం నేడు శిథిలావస్థకు చేరింది. ఏ క్షణాన ఈ పథకం కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్యం కూడా క్షీణించింది. రహదారి పక్కనే చెత్త వేసేయడంతో దుర్వాసన వస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. మూలపేట శివారు గంగాదేవి పేటలో కాలువల్లో షిల్టు పేరుకుపోతోంది. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి శిథిలం కావడంతో రాకపోకలకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మలాడ, నాగులాపల్లి గ్రామాల శివారు ప్రాంతాలు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. పల్లపు ఆనందపురం శివారు కుమారపురం కూడా సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. డ్రైనేజీ సదుపాయాన్ని పూర్తిస్థాయిలో కల్పించాలని కోరుతున్నారు. మెలిపాక శివారు చిన యాదగిరి పాలెం ప్రజలు ఇప్పటికీ మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వర్షా కాలంలో బురదలోనే ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.



పురుషోత్తపురంలో శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి పథకం



గంగాదేవిపేటలో శిథిలమైన రహదారి

సమస్యలపై తీర్మానాలు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగ నిధుల మంజూరు కోసం ఇటీవల గ్రామసభల్లో తీర్మానాలు సైతం చేశారు. శివారు గ్రామాల్లో రహదారులు, కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. పారిశుధ్యం మెరుగు, తాగునీటి సదుపాయం, అసంపూర్తి సామాజిక భవనాల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శివారు గ్రామాలపై దృష్టి సారించాలి



శివారు గ్రామాల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి. ప్రభుత్వ కార్యక్రమాలను పంచాయతీల పరిధిలో నిర్వహించకుండా శివారు గ్రామాల్లో ఏర్పాటు చేస్తే సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. పాలకులు, అధికారులు స్పందించి శివారు గ్రామాల అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరు చేయాలి.

– ఇల్లా నాగేశ్వరరావు, కాకరాపల్లి

దశల వారీగా అభివృద్ధి చేస్తాం..



పల్లె పండగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని రహదారులు, కాలువల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గ్రామాల్లో సమస్యలను గుర్తించి దశల వారీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి పంచాయతీతో పాటు శివారు గ్రామాల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తాం. గ్రామాలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– ఎం.ఉషారాణి, ఎంపీడీవో, ముగపాక

రోడ్డు మధ్యలో బోరు



కోటవురట్లలో సీసీ రోడ్డు మధ్యలో ఉన్న చేతిబోరు

కోటవురట్ల: స్థానిక బీసీ కాలనీలో సీసీ రోడ్డు మధ్యలో ఉన్న చేతి బోరుతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఈ చేతి బోరు నిదర్శనంగా నిలుస్తోంది. ఇక్కడ సీసీ రోడ్డు వేయక ముందు మధ్యలో చేతిబోరు ఉండేది. సీసీ రోడ్డు మంజూరు కావడంతో చేతిబోరును తొలగించకుండా, అలాగే వదిలేసి సీసీ రోడ్డు వేసి చేతులు దులిపేసుకున్నారు. అప్పటి నుంచి స్థానికులకు ఇక్కట్లు మొదలయ్యాయి. రోడ్డు మధ్యలో చేతి బోరు ఉండడంతో కారులు, భారీ వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. చేతిబోరు నుంచి వచ్చే వృథా నీరు రోడ్డుపైకి చేరి నాచుపట్టి పాదచారులు జారిపడుతున్నారు. అధికారులు స్పందించి చేతిబోరును రోడ్డుకు పక్కన ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదర్శంగా తోటాడ పంచాయతీ

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు. తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తన కోటా నుంచి రూ.5 లక్షలు, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి రూ.3 లక్షల మేర నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించేందుకు సోమవారం సర్పంచ్ కూటమి నేతలతో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆవ కాలువను ఆనుకొని రింగ్ రోడ్డుకు డ్రైనేజీ నిర్మాణం, శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పొలమరశెట్టి మురళి, రాపేటి పరమేష్, చదరం భాస్కరరావు, గంగాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జయరామ్, తదితరులు

నక్కపల్లి: ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు హాజరయ్యే పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు రాజకమల్, వింగ్స్ ఫౌండేషన్ ఉచితంగా స్టడీ మెటీరియల్ సరఫరా చేసింది. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు ఎర్రమిల్లి వెంకట జయరామ్ ఈ పుస్తకాలను విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఏవీఎల్ కుమారి, ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫల్గుణరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: ఏటికొప్పాక జిల్లా పరిషత్ పాఠశాలలో రాజ్ కమల్ ఫౌండేషన్ ప్రతినిధులు 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎర్రమిల్లి వెంకట జయరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగపర్చుకోవాలన్నారు. సంస్థ కార్యదర్శి ఎం.జయ ప్రకాష్, వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘అభిజిత్’ ఉద్యోగుల ఆందోళన తాత్కాలిక వాయిదా



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాము

అచ్యుతాపురం(మునగపాక): అభిజిత్ కంపెనీ ఉద్యోగులు, కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ చేపడుతున్న ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము తెలిపారు. సోమవారం అభిజిత్ కంపెనీ ఎదుట ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతో సంప్రదింపులు జరపకుండా లే-ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. వెయ్యి మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు వీధిన పడ్డారన్నారు. అభిజిత్ కంపెనీ యాజమాన్యంపై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు వేచి చూస్తామని, అప్పటికీ న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

సృష్టిలో ప్రథమ గ్రంథం భగవద్గీత



చౌడువాడలో త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల: ఈ సృష్టిలో ప్రథమ దైవ గ్రంథం భగవద్గీత అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. చౌడువాడ గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. కరపత్రాలు, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు యుద్ధ రంగంలో అర్జునుడికి భగవద్గీత సారాన్ని వివరించారన్నారు. గీతలో ఉన్న ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. భగవద్గీత మనిషికి జ్ఞానాన్ని అందించి సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమండి కమిటీ సభ్యులు సోమునాయుడు, శ్రీనివాస్, రమాదేవి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రీసర్వేలో లోపాలకు సవరణ



గంటవానిపాలెంలో సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆది మహేశ్వరరావు

మునగపాక: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆది మహేశ్వరరావు కోరారు. సోమవారం మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో జరిగిన లోపాలను సవరించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. తేడాలను కూడా సరిచేసే అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, రీ-సర్వే డీటీ పడాల్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుపాను హెచ్చరికలు జారీ

ఎస్.రాయవరం: మండలంలో తుపాను ప్రభావంతో హెచ్చరికలు జారీ చేశామని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం నుంచి గురువారం వరకు తుపాను తీవ్రత ఉంటుదని, రేవుపోలవరం, బంగారమ్మపాలెం మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఈ మూడు రోజులు మండల తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మండలంలో లోతట్టు గ్రామాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతానికి చేరుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్ : 90323 14938కు చెప్పవచ్చన్నారు.

29న ప్రజా వేదిక

కోటవురట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను ఈ నెల 29న నిర్వహించనున్నట్టు ఏపీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 25 పంచాయతీలలో సామాజిక తనిఖీ చురుగ్గా జరుగుతోందని, ఈ నెల 28వ తేదీతో పూర్తవుతుందని తెలిపారు. తనిఖీలలో గుర్తించిన అంశాలకు సంబంధించి గ్రామసభల ద్వారా వెల్లడిస్తారని తెలిపారు. గొట్టివాడ, పాములవాక గ్రామాలలో 22న, చౌడువాడలో 23న, బి.కె.పల్లి, బోడపాలెం, కొడవటిపూడి, కోటవురట్ల 24న, రామన్నపాలెం, యండపల్లి, తంగేడు గ్రామాలలో 25న, పందూరు, టి.జగ్గంపేట, చినబొడ్డేపల్లి, రామచంద్రపురం, రాజుపేట గ్రామాలలో 27న, నీలిగుంట, జల్లూరు, ఆక్సాహేబుపేట, అన్నవరం, సుంకపూరు, రామచంద్రపాలెం, కైలాసపట్నం, కె.వెంకటాపురం, లింగాపురం గ్రామాల్లో 28న గ్రామసభలు జరుగుతాయని పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ



రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాయకరావుపేట: పాయకరావుపేట డివిజన్ పరిధిలో 5 మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బందికి రైతు శిక్షణ కేంద్రం ఆత్మ సౌజన్యంతో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై జిల్లా వనరుల కేంద్రం అధికారులు పి.విజేత, వి.తులసి వివరించారు. ఉద్యాన పంటలపై సమగ్ర యాజమాన్య పద్ధతులను బీసీటీకేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శివ తెలియజేశారు. స్ప్రే చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా ఏపీసీఎన్ఎఫ్ సేంద్రియ సాగు సిబ్బంది వివరించారు. సహాయ గణాంక అధికారి ఎస్.కె.అక్బర్ పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమా ప్రసాద్, ఏవోలు చిరంజీవి, శైలజ, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పి.ధర్మవరం ఫీడర్ పరిధిలో పెనుగొల్లు గ్రామానికి మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అడ్డురోడ్డులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. అడ్డురోడ్డులోని ఓ తోటలో జరిగిన ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు సుమారు 40 మంది సందడి చేశారు. ఎక్కడెక్కడ స్థిరపడ్డారో తెలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని ఉల్లాసంగా గడిపారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న గంగమహేష్ కుటుంబ సభ్యులు

మునగపాక: వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆలయ నిర్మాణానికి మునగపాకకు చెందిన ఆడారి గంగమహేష్ కుటుంబ సభ్యులు రూ.1,11,111 నగదును కమిటీ సభ్యులకు ఆదివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.4 కోట్ల మేర వ్యయం అవుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి అచ్చియ్యనాయుడు, విల్లూరి నూకనరసింగరావు, దాడి భీమునాయుడు, ఆడారి లక్ష్మణరావు, టెక్కలి కొండలరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



మునగపాక పోలీసు స్టేషన్‌లో అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు



కోటవురట్లలో అమరవీరులకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్‌లో సోమవారం అమరవీరుల దినోత్సవాలు ఘనంగా జరిగాయి. అమరవీరుల చిత్ర పటాలకు ఏఎస్‌ఐలు మన్మథరావు, రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రాణాలర్పించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పోలీసులు విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. దేశ రక్షణ, ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన అమరులైన పోలీసులను స్మరించుకోవడం అందరి కర్తవ్యమని వక్తలు అన్నారు.

బీసీ వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య



మరుగుదొడ్లు పని చేయడం లేదని చెబుతున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల సమస్య విద్యార్థులను వేధిస్తోంది. దసరా సెలవులు ముగించుకుని వసతి గృహానికి వచ్చిన విద్యార్థులకు మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో సమీపంలో తోటల్లోకి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల తెరిచి వారం రోజులు గడుస్తున్నా అధికారులు సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని వాపోతున్నారు. ఈ విషయమై వార్డెన్ నాయుడిని వివరణ కోరగా.. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకు సమస్య ఉందని, వర్షాల కారణంగా నీరు ట్యాంకులోకి చేరడం వల్ల నిండిపోయిందన్నారు. తాను ఇటీవల ఇక్కడ బాధ్యతలు చేపట్టానని, ఇక్కడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. రూ. 1.50 లక్షల నిధులు కేటాయించారని, త్వరలో పనులు చేపడతామని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్ :
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com